## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఇబ్రహీంపట్నం:** వైట్ గోల్డ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆక్టోపస్, తట్టిఖానా, నాగన్‌పల్లి ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆక్టోపస్ ఫీడర్ పరిధి.. ఇండస్ట్రీయల్ సర్వీసెస్, ఫౌల్ట్రీలు, వినోభానగర్, తట్టిఖానా, నాగన్‌పల్లి గ్రామాల పరిధి వ్యవసాయ బావులు, బోర్లు, గృహాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### జీపీ సిబ్బందికి దసరా కానుక



సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి:** దసరా పండుగ సందర్భంగా మండల పరిధి రాంపూర్ పంచాయతీ సిబ్బందికి గురువారం హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ నర్సింహులు కానుకగా.. నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసచారి, కృష్ణ, రాములు, మల్లయ్య, కృష్ణయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్

**ఆమనగల్లు:** మున్సిపల్ సిబ్బందిని ఎస్‌ఐ వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం కార్యక్రమాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన రవి, గోపి, విజయ్, ప్రశాంత్, నర్సింహ, శ్రీను, పెంటయ్య, సుధాకర్, చిన్నా, రామకృష్ణ, చిట్టిబాబు, రాములును పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఎస్‌ఐ సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ యాదయ్య, సిబ్బంది లక్ష్మణ్, రంజిత్, శివకుమార్ పాల్గొన్నారు.

### రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం



యాదిరెడ్డికి నగదు అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

**అబ్దుల్లాపూర్‌మెట్:** మండల కేంద్రం బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, జాఫర్‌గూడ గ్రామానికి చెందిన కోటా జంగారెడ్డి జులైలో చనిపోయాడు. ఈ నేపథ్యంలో సంఘం తరఫున మృతుడి కుమారుడు యాదిరెడ్డికి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని గురువారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ సంఘం కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### విధులను బహిష్కరించి.. న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

**ఇబ్రహీంపట్నం:** నాంపల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది ఎండీ అబ్దుల్ ఖలీమ్‌పై మాదన్నపేట పోలీస్ అధికారులు దాడి చేయడాన్ని పట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌కుమార్, కార్యదర్శి మహేందర్‌లు ఖండించారు. ఈ మేరకు గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే తమకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాదన్న, రాములుగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, ఆకుల రమేష్, ధనంజయ్‌గౌడ్, గణేశ్, బాస్కర్, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లిలో.. కొలువైన అమ్మవారు



ఆమనగల్లు: హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

# శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- బాలాత్రిపురసుందరి దేవిగా దర్శనం ఇచ్చిన దుర్గమ్మ
- ప్రత్యేక పూజలు చేసిన భక్తజనం

**ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం:** దేవీ నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ, శ్రీ భక్తమార్కండేయస్వామి ఆలయాల్లో బాలాత్రిపురసుందరి అలంకరణలో దుర్గమ్మ ఆసీనులు కాగా.. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో చైర్మన్‌వీరబొమ్మ రామ్మోహన్, సభ్యులు బికుమాండ్ల రమేశ్, నర్సింహులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాండయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, రమేశ్, లింగయ్య, చంద్రశేఖర్, సుమన్, నాగరాజు, వెంకటేశ్, మణికంఠ, సిద్ధు, తేజ తదితరులు పాల్గొన్నారు. కోనాపూర్ వేడుకల్లో టీడీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి యాదీలాల్ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంలో..**

అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్నంలోని ఈశ్వ



ఇబ్రహీంపట్నం: అయ్యప్పస్వామి దేవాలయంలో కొలువైన దుర్గమ్మ

రాంజనేయ, అయ్యప్పస్వామి, లక్ష్మీనృసింహాస్వామి, మహంకాళి ఆలయాల్లో అమ్మవారు కొలువయ్యారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేవారు.



ఆమనగల్లు: బాలాత్రిపురసుందరి దేవి అలంకారంలో అమ్మవారు



మాడ్గుల: కోల్కులపల్లిలో..

# భారతి సిమెంట్‌కు తిరుగులేదు

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న సంస్థ
- కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ బద్రి

**యాచారం:** సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ గుర్తింపు పొందిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి అన్నారు. నాణ్యతలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్మిప్రియ ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాఫాస్ట్ పేరుతో సంస్థ ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని, మార్కెట్లో లభించే ఇతర కంపెనీలతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందని వివరించారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల ఎంపికకు భారతికి పెట్టింది పేరని వెల్లడించారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత



తాపీ మేస్త్రీలకు సామగ్రి అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సాంకేతిక సహాయం అందజేస్తామని హామీనిచ్చారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సహాయపడతారని తెలిపారు. అనంతరం మేస్త్రీలకు సామగ్రిని అందజేశారు. సమావేశంలో డీలర్ తలారి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ పండుగను ఆడపడుచులు సంబురంగా జరుపుకొన్నారు. రెండో రోజైన గురువారం వెల్జాల్‌లో తీరొక్కపూలతో పేర్చిన పూలగోపురాలను గ్రామ చావడి వద్ద ఉంచారు. లయబద్ధంగా చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. - తలకొండపల్లి

# భూమి కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం

**కందుకూరు:** ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. భూములు కోల్పోయిన మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన రైతులు.. గురువారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ వారితో మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు. టీజీఐసీసీ అధికారులు, స్థానిక నాయకులతో చర్చించి ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారంతో పాటు గతంలో ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా ఇల్లీగల్‌గా స్థలాలు పొందినా వారిని గుర్తించి తొలగించేలా



కేఎల్ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీర్‌ఖాన్‌పేట రైతులు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**తలకొండపల్లి:** మండల పరిధి జూలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి తల్లి పూలమ్మ(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రేణురెడ్డి, రఘుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

### ఊరెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి



సీఐ జగదీశ్

**మాడ్గుల:** దసరా పండుగకు సొంతూర్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సీఐ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో డబ్బులు, బంగారం, విలువైన పత్రాలను ఉంచరాదని, బ్యాంకు లాకర్లలో భద్రపర్చాలని వెల్లడించారు. లేని యెడలా వెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వీధుల్లో ఎవరైనా కొత్తవారు సంచరిస్తే.. వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ వెల్లడించారు.

### 'మా భూమిని కాపాడండి'

**పహాడీషరీఫ్:** భూమిని ఆక్రమించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకొని, మా భూమిని కాపాడాలని గురువారం మామిడిపల్లి గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మామిడిపల్లి గ్రామంలో 2007 గ్రామానికి చెందిన గొంద్యాల, కోట్ల వశంస్థులకు చెందిన సుమారు 50 మంది రైతులు సర్వేనంబర్ 99/1 భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గత రాత్రి బుధవారం తమ భూమికి ఆనుకొని ఉన్న భూయజమాని, తమ పొలాలను ఆక్రమించి షెడ్లను కూల్చివేశారని వాపో యారు. భూ వివాదం చాలాకాలంగా జరుగు తోందని, ఇదే విషయమై గతంలో మండల రెవెన్యూ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి ఫిర్యాదు చేశామని పేర్కొ న్నారు. అధికారులు స్పందించి, ఇరువురి భూముల రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

# అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

- నాలుగు సంవత్సరాలైనా పూర్తికాని నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మీర్‌ఖాన్‌పేట వయా కందుకూరు రోడ్డు దుస్థితి

**కందుకూరు:** అసంపూర్తి రహదారి నిర్మాణ పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి నాలుగేళ్లు దాటినా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా.. రోడ్డును తవ్వి మట్టి పోసి వదిలేశారు. ఇదీ.. మండల పరిధి వావిళ్లకుంటతండా పెద్దమ్మ దేవాలయం నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా యాచారం ఆర్అండ్‌బీ రహదారి దుస్థితి ఇది.

**13.2 కిలో మీటర్లు**

మండల పరిధి బేగరికంచె పరిధి వావిళ్లకుంటతండా ఫార్మా రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా యాచారం వరకు 13.2333 కి.మీ. రోడ్డు విస్తరణకు 2019లో నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ.84.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2020లో నిర్మాణ పనులు ప్రారంభించింది. కానీ భూసేకరణ పూర్తికాలేదు. కేవలం నందివనపర్తి, మీర్‌ఖాపేట గ్రామాల్లో మాత్రమే సుమారు రెండున్నర కిలో మీటర్ల మేర సీసీ, బీటీ రహదారిని నిర్మించారు.

**మట్టి పనులతో మమ..**

ఫార్మా రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట వర కు కొంత దూరం బీటీని నిర్మించారు. అక్కడి నుంచి గ్రామం ప్రారంభం వరకు తవ్వి మట్టిపోసి వదిలేశారు. గ్రామం దాటిన తర్వాత సింగారం మధ్యలో తవ్వకాలు జరిపి, మట్టి పనులు చేసి మమ అనిపించా రు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మట్టిపోసి వదిలేయడంతో బురదమయంగా మారి, గోతులు ఏర్పడి రవాణా సౌకర్యానికి ఆటంకం కలిగిస్తోంది. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

# హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్ మార్చండి

పవర్ గ్రిడ్ డీజీఎంకు రైతుల వినతి

**కడ్తాల్:** వ్యవసాయ పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ హైటెన్షన్ లైన్ వేసేందుకు వేసిన మార్కింగ్‌ను మార్చాలని కడ్తాల్ రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో పవర్ గ్రిడ్ ఫీడర్ ట్రాన్స్‌మిషన్ డీజీఎం సంతోష్, చీఫ్ మేనేజర్ గణేశ్, ఇంజినీర్ గోపాల్‌తో స్థానిక నాయకులు లక్ష్మీ నర్సింహరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో చిన్నసన్నకారు రైతులే అధికంగా ఉన్నారని, ఉన్నదాంట్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అలాంటి తమ పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. లైన్ వేయడం వలన తాము రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. అంతేకాకుండా వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రానికి సమీపంలో హైటెన్షన్ లైన్ వేయడం వలన భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అలైన్‌మెంట్ గురించి పునరాలోచించాలని కోరారు.



డీజీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

అలైన్‌మెంట్ మరో దిశగా మార్చి వేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీజీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జంగారెడ్డి, రైతులు రాములుయాదవ్, వెంకటేశ్, అభిషేక్‌రెడ్డి, జంగారెడ్డి, జంగయ్య యాదవ్, చేగూరి రాములు, పాండు, రవి, మహేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గణేశ్, శ్రీనివాస్‌జీ, కిరణ్, శ్రీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాపై శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నర్సిరెడ్డి

**మాడ్గుల:** కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గురువారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ నర్సిరెడ్డి మాట్లాడారు. తాగునీటి సరఫరాలో తలెత్తే సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి ఇద్దరిని సహాయకులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా వారికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాస్, సాయిధి రాజ్, జీపీ తాగునీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు

**తలకొండపల్లిలో..**

**తలకొండపల్లి:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సరఫరా సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీ అయినట్లు గుర్తిస్తే.. వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్తగా పైపులైన్‌ను ఏర్పాటు చేసి, నీటి ఎద్దడిని నివారించాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘు, ఏఈ ప్రణీత్, కేతన్, నీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట 23వ డివిజన్‌లో ప్రసిద్ధి చెందిన కాశిబుగ్గ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం హాల్ నిర్మాణానికి గురువారం మేయర్ చిగురింత పారిజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రసిద్ధి చెందిన దేవస్థానంలో శివుడు, వేంకటేశ్వరుడి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం హాల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూడు నెలల్లో హాల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ హాల్‌లో చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మాజీ వైస్ చైర్మన్ నర్సింహరెడ్డి, స్థానిక కార్పొరేటర్ సంతోషి,



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు, స్థానికులు

కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, పి.సుదర్శన్‌రెడ్డి, దేవస్థాన టెంపుల్ నిర్వాహకులు మధుమోహనాచార్యులు, జగన్‌మోహన్ చార్యులు పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

**ఇబ్రహీంపట్నం:** పట్నంలోని క్రిస్టియన్ ఎడ్యుకేషన్ కౌన్సెలింగ్ సెంటర్‌పై దాడికి పాల్పడి, పలువురిని గాయపరిచిన వ్యక్తులను అరెస్టు చేయాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేరుషలేం మత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సెంటర్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తదితర ఉన్నత పదవుల కోసం కేరీర్ గైడెన్స్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు, క్రమశిక్షణ, మానసిక, ఆధ్యాత్మిక, మెడిటేషన్ గురించి అవగాహన సదుస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న తమ సంస్థపై హిందూవాహిని, విశ్వహిందూ పరిషత్‌లు తప్పుడు ప్రచారం చేయడంతో పాటు.. కేంద్రంపై దాడి చేసి, కొందరిని గాయపరిచారని ఆరోపించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు.

# కొరవడిన నిఘా..

- సీసీరోడ్డుకు క్యూరింగ్ చేయని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికార యంత్రాంగం

**తుర్కయంజాల్:** లక్షల రూపాయలు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులపై పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిఘా కొరవడింది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మాణ పనులను చేపడుతూ ప్రజాధనాన్ని బిల్లుల రూపంలో దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తార్నాకం కమ్మగూడలోని 22, 23వార్డులను కలుపుతూ రూ.30లక్షలతో వారం రోజుల క్రితం సీసీరోడ్డును నిర్మించారు. కానీ సదరు నిర్మాణదారుడు రోడ్డు వేసిన నాటి నుంచి నేటి వరకు ఒక్కసారి కూడా నీటితో క్యూరింగ్ చేయలేదని స్థానికులు పేర్కొంటున్నారు. వేసవి కాలం విధంగానే ఎండలు మండిపోతున్నాయని, క్యూరింగ్ చేయకపోతే సీసీరోడ్డు నెర్రెలు వారే ప్రమాదం ఉందంటూ పలువురు అభిప్రాయపడ్డారు.

**నెర్రెలు వారి, కంకర తేలి..**

కట్టలు కట్టి, సుమారు 14 రోజుల పాటు నీరు నిలిచేలా చర్యలు తీసుకుంటే ఆ నిర్మాణం నాణ్యతగా ఉండి, నాలుగు కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడుతుంది. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణాల్లో పూర్తిగా నాణ్యత లోపించిందన్న ఆరోపణలు లేకపోలేదు. పలు కాలనీల్లో సీసీ వేసి మూడు నెలలు తిరగకుండానే నెర్రెలు వారి, కంకర తేలాయి. క్రమంగా గోతులు ఏర్పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి నిర్మాణ పనులను పర్యవేక్షించడంతో పాటు.. సీసీరోడ్డుకు క్యూరింగ్ చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



క్యూరింగ్ చేయని సీసీరోడ్డు

**నాణ్యత కొరవడితే బిల్లు ఇవ్వం**

సీసీరోడ్డుకు క్యూరింగ్ చేయని విషయం మా దృష్టికి రాలేదు. రోడ్డు నాణ్యతపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తాం. నాణ్యత లోపించడం, రోడ్డు దెబ్బతిన్నట్లు తేలితే బిల్లులు మంజూరు చేయం. కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి.

– భిక్షపతి, ఏఈ, ఇంజినీరింగ్ విభాగం, తుర్కయంజాల్